www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 24 డిసెంబరు 2022

5

పశ్చిమ గోదావరి



ప్రముఖ నటుడు కైకాల మృతికి..

సిపిఎం సంతాపం



ప్రజాశక్తి - భీమవరం

ప్రముఖ నటుడు, నిర్మాత, మాజీ ఎంపీ కైకాల సత్యనారాయణ మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ కమిటీ జిల్లా కార్యదర్శి బి.బలరాం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సినీ నటులు సత్యనారాయణ మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులకు, సినీ అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్యనారాయణ పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించారని పేర్కొన్నారు. ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటని తెలిపారు.

ఆర్థిక వ్యవస్థపై యువత దృష్టి సారించాలి



శర్మను సన్మానిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మానేపల్లి సూర్యనారాయణ గుప్త, సంఘ సభ్యులు

కార్పొరేట్ల విన్యాసాలు, ప్రభుత్వ విధానాల ఫలితమే మాంద్యం

సదస్సులో మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాయడం వల్లే సామాన్యులు కొనుగోలు శక్తి కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్నారని, ఆర్థిక వ్యవస్థపై యువత దృష్టి సారించి కార్పొరేట్ శక్తుల ఆగడాలను అడ్డుకున్ననాడే దేశ పురోగతి సాధ్యమని మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ అన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా 'ప్రపంచ ఆర్థిక మాంద్యం–కారణాలు–పరిష్కారాలు' అనే అంశంపై సెమినార్ శుక్రవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్త శర్మ మాట్లాడుతూ కార్పొరేట్ల వ్యాపార విన్యాసాలతో ఆర్థిక మాంద్యం ముంచుకొస్తుందన్నారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. గతంలో విద్య, వైద్యం కొంత బాగున్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వాలు ఈ రెండింటినీ పక్కన పెట్టేశాయన్నారు. ఉపాధి హామీ చట్టం కింద అవసరమైన పనులు చేయించుకోవచ్చని, అయితే ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూడం దారుణమని అన్నారు. గతంలో శాసనమండలిలో తాను విశాఖ జిల్లా గంగవరం పోర్టుకు ఎకరం రూపాయి చొప్పున 1800 ఎకరాలు ఇవ్వడంపై ప్రశ్నించగా ఉచితంగా ఇవ్వడానికి చట్టం ఒప్పుకోదని నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చెప్పారన్నారు. కార్పొరేట్ రాజు బ్యాంకుల్లో అప్పు తెచ్చి అక్కడ 29 బెర్త్‌లు కట్టగా అదానికి ఆ బెర్త్‌లు అమ్మినప్పుడు ఈ ముఖ్యమంత్రి ఏమీ మాట్లాడకుండా కాగితం రాసి ఇచ్చారన్నారు. కరోనా సమయంలో అమెరికా వంటి దేశాలు ప్రజలపై పన్నుల భారం తగ్గించడమే కాకుండా ఇంటి అద్దెలు కూడా చెల్లించాయని గుర్తు చేశారు. అయితే మన దేశంలో మాత్రం కరోనా సమయంలో చాలా నష్టపోయామని ప్రధాని చెబుతున్నారని, ఒక్క పెట్రోల్, డీజిల్‌పై అదనపు పన్ను వేసి రూ.6.30 లక్షల కోట్లు వసూలు చేశారన్నారు. అదే సమయంలో వలస కూలీలు కాలినడకన వెళ్తూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. కార్పొరేట్లకు రాయితీల మీద రాయితీలు ఇస్తూ సామాన్య ప్రజల నుంచి ఇంటి పన్ను కూడా మార్కెట్ విలువ ప్రకారం వసూలు చేస్తున్నారన్నారు. పెద్దనోట్ల రద్దు ఎన్నికల కోసం కాదని, చిరు వ్యాపారులను నాశనం, కార్పొరేట్ శక్తుల బాగు కోసమేనని అన్నారు. దేశంలో చిరువ్యాపారులు నాలుగు కోట్ల మంది, రోడ్డు పక్కన, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునేవారు 11 కోట్ల మంది ఉన్నారన్నారు. ఇదే సమయంలో డీమార్ట్, వాల్‌మార్ట్ వంటి షాపింగ్‌మాల్స్ వల్ల కేవలం కోటీ 25 వేల మందికి మాత్రమే ఉపాధి దొరుకుతుందని, మిగిలినవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. యువత ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించకపోతే ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్ని బాబూరావు, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు బి.బలరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులు నిలబడాలంటే కార్పొరేట్లను అడ్డుకోవాలి

మానేపల్లి సూర్యనారాయణగుప్త, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు



కుటుంబ పోషణ కోసం చిరు వ్యాపారులు తరతరాలుగా వ్యాపారాలు చేస్తున్నారు. నేడు కార్పొరేట్ శక్తులు పెద్దపెద్ద మాల్స్ పెట్టడంతో చిరు వ్యాపారులు నాశనమవుతున్నారు. దీంతో వ్యాపారాలు చేయాలో, మానాలో తెలియని పరిస్థితుల్లో చిరువ్యాపారులు కొట్టుమిట్లాడుతున్నారు.

ఆర్థిక వ్యవస్థపై అవగాహన తప్పనిసరి

కె.సత్యాదేవి, ప్రముఖ న్యాయవాది



సమాజ అభివృద్ధిలో యువతే కీలకం. ఆర్థిక వ్యవస్థపై యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలి. కార్పొరేట్ శక్తుల వల్ల రైతులు, సామాన్యులు కూడా ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని సామాన్యులకు అర్థమయ్యే రీతిలో చెప్పేందుకు యువత చొరవ చూపాలి.

పాతవి తీస్తారు.. కొత్తవి ఇస్తారు..!



- పింఛన్ల ఏరివేతకు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు
- ప్రతి సచివాలయ పరిధిలో 5 నుంచి 15 పింఛన్లు కోత
- వాటి స్థానంలో జనవరిలో కొత్త పింఛన్లు
- విద్యుత్ బిల్లుల సాకుతో ఏరివేతకు ప్రణాళిక
- రెండు జిల్లాల్లో పింఛన్ లబ్ధిదారులు 4.83 లక్షల మంది

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఒక ప్రాణం తీశా.. మరో ప్రాణం పోశా.. లెక్క సరిపోయింది' అంటూ ఓ సినిమాలో విలన్ చెప్పిన డైలాగ్ సామాజిక పింఛన్ల మంజూరులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు అతికినట్లు సరిపోతుంది. ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్ల మంజూరు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. అదే సమయంలో ఆరు నెలలకోసారి విద్యుత్ బిల్లులతోపాటు అనేక సాకులు చూపుతూ ఉన్న పింఛన్లను తొలగించే ప్రక్రియకు సైతం ప్రభుత్వం పూనుకుంటుంది. ప్రభుత్వం చెప్పిన ప్రకారం వచ్చే జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 2.65 లక్షల మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 2.18 లక్షల మంది సామాజిక పింఛన్లు అందుకుంటున్నారు. వీటిలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు వంటి పలు రకాల పింఛన్లు ఉన్నాయి. అర్హత ఉండి కూడా అనేక మందికి పింఛన్లు అందని పరిస్థితి ఉంది. వీరంతా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఆరు నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి వారు ఏలూరు జిల్లాలో దాదాపు పది వేల మంది ఉండగా, పశ్చిమగోదావరి జిల్లాలో ఐదువేలకుపైగా కొత్త పింఛన్లకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం ఉన్న పింఛన్లను తొలగించేందుకు పూనుకుంది. పింఛను అందుకుంటున్న వారి కరెంటు బిల్లులను ఆరు నెలల సరాసరి పరిశీలించి 300 యూనిట్లు దాటితే పింఛన్ నిలిపివేస్తోంది. ఈ కాలంలో ఇంట్లో ఏదైనా వివాహం, వేరే వేడుకలు జరిగి విద్యుత్ బిల్లు పెరిగితే పింఛన్ ఆగిపోయినట్టే. ఇలా పలు నిబంధనలను తెరపైకి తెచ్చి పింఛన్లను ఆపేస్తోంది. పరిశీలన పేరుతో ప్రతి సచివాలయ పరిధిలో ఐదు నుంచి 15 పింఛన్లు వరకూ ఏరివేత జాబితాలో చేరాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 1165 వరకూ గ్రామ, పట్టణ సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయ పరిధిలో పది పింఛన్లు ఏరివేసినా 11 వేలకుపైగా పింఛన్లు నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఏరివేత జాబితా సంఖ్య గురించి ఏఒక్క అధికారీ సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. 20, 30 ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లకు విద్యుత్ మీటర్లన్నీ దాదాపుగా ఇంటి పెద్ద పేరుపైనే ఉన్నాయి. కుమారులు ఆ ఇంట్లో ఉంటున్నప్పటికీ పింఛన్ అందుకుంటున్న వ్యక్తి పేరుపైనే విద్యుత్ మీటర్ నడుస్తోంది. కుమారులు విద్యుత్ వాడుకుంటే ఏసంబధం లేని వృద్ధుల పింఛన్ ఆపేస్తున్నారు. ఇలాంటివి అనేక ఇబ్బందులు ఉన్నాయి.

పింఛన్ల మాయ

ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఏరివేసిన పింఛన్ల గురించి మాత్రం చెప్పడం లేదు. కొత్త పింఛన్లు ఎన్ని మంజూరు చేస్తే దాదాపు అదేస్థాయిలో పాత పింఛన్లు తొలగిస్తున్నారు. పింఛన్లు సంఖ్య పెరగకుండా ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోంది. పింఛన్ల ఏరివేతకు సంబంధించిన వివరాలు డిఆర్‌డిఎ కార్యాలయ సిబ్బంది తమకు తెలియదని చెబుతున్నారు. నేరుగా సచివాలయ సిబ్బంది లాగిన్‌లోకి పంపించి పింఛన్ల ఏరివేత చేపడుతున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ వంటి రాష్ట్రంలో 300 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ ఇస్తుంటే ఇక్కడ మాత్రం మూడొందల యూనిట్లు విద్యుత్ వాడుకుంటే సంక్షేమ పథకాలు ఆపేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో కొత్త పింఛన్ల మంజూరులో ప్రభుత్వ కపట నాటకం ఆడుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. జనవరి నుంచి రూ.2500గా ఉన్న పింఛన్ రూ.2,750కు పెరగనుంది. ఈ తరుణంలో పింఛన్ల ఏరివేత ఎంతోమంది లబ్ధిదారులకు తీరని వేదన మిగుల్చుతోంది.

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలో జనవరి 2, 3, 4 తేదీల్లో నిర్వహించబోయే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని మహాసభ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద మహాసభ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు రాష్ట్ర మహాసభ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరగనుందన్నారు. మహాసభ ప్రారంభ సందర్భంగా కార్మిక, ఉద్యోగ ఐక్యతను చాటేలా జనవరి 2న భీమవరం పట్టణంలో గొప్ప ప్రజాప్రదర్శన, భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా కేరళ రాష్ట్ర న్యాయ, పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్, సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ తపన్‌సేన్, అధ్యక్షులు డాక్టర్ హేమలత, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ ఎంఎ.గఫూర్, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, అఖిల భారత ఉపాధ్యక్షురాలు బేబిరాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో కార్మికోద్యమానికి దిశానిర్దేశం చేసే దిశగా ఈ మహాసభలో చర్చలు జరగబోతున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, దాని అడుగుజాడల్లో ముందుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఆయన మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి యాజమాన్యాలకు, కార్పొరేట్లకు వంతపాడటం దారుణమన్నారు. వీటివల్ల దేశంలోని కార్మికవర్గానికి ఎలాంటి రక్షణా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి స్థానంలో తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లను తిప్పికొట్టేలా భవిష్యత్‌లో పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కనీస వేతన చట్టాన్ని సవరించి, నేటి ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ మహాసభ నిర్వహణ కోసం పట్టణంలో విస్తృతమైన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఇటీవల తాడేపల్లిగూడెం పట్టణంలో ఫుడ్‌ఫ్యాట్స్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు. ఒక కార్మికుడు మతి చెందగా, మరో ఇద్దరు రాజమండ్రిలో, ముగ్గురు తాడేపల్లిగూడెం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడమే ఈ ప్రమాదానికి కారణమన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో కార్మిక, ఫ్యాక్టరీ శాఖలచే తనిఖీలు లేకపోవడం, ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు, పర్యావరణానికి చెందిన విషయాలను గాలికొదిలేయడం, అధికారుల పర్యవేక్షణా లోపం వల్లే ఈ ప్రమాదం సంభవించిందన్నారు. జిల్లాలో కొన్ని పరిశ్రమల్లో ఇటువంటి ప్రమాదాలు తరచూ జరగడం వల్ల ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కార్మిక, ఫ్యాక్టరీ శాఖ తనిఖీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, అల్లూరి అరుణ్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్: సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం తోకతిప్ప, వెంప గ్రామాల్లో రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడగా చిలకపాటి సూర్యప్రకాష్, తూటే సుభాకర్‌రావు, బొడ్డు వెంకటలక్ష్మి, పొన్నాల దుర్గ, బొడ్డు లక్ష్మీపతి, పొన్నాల విజయకుమారి, తిరుమాని మల్లేశ్వరి, వాటాడి మంగ, నాగర్జున, తిరుమాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దళితుల శ్మశానవాటికకు రెండెకరాలు కేటాయించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి దళితపేటకు జిఒ నెంబర్ 1235 ప్రకారం రెండెకరాల భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. జిల్లాలో శ్మశానవాటికల కోసం భూసేకరణపై జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ప్రకటనపై క్రాంతిబాబు స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్‌లో జిల్లాలో రెవెన్యూ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ దళితపేటల్లో శ్మశాన వాటికల కోసం చర్చించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలోని 19 మండలాల్లో సుమారు 296 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు అధికారులు కేవలం 81 గ్రామాల్లోనే శ్మశాన వాటికల ఏర్పాటుకు గుర్తించారని పేర్కొన్నారు. అందులోనూ కేవలం 59.3 ఎకరాల భూమిని మాత్రమే గుర్తించారని, దీన్ని బట్టి ప్రతి దళితపేటకు ఎంత భూమిని కేటాయిస్తారని ప్రశ్నించారు. నేటికీ జిల్లాలో జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు ఎక్కడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అరకొరగా ఉన్న శ్మశానవాటికలు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని, వెళ్లడానికి సరైన దారి కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా చనిపోతే కొన్నిచోట్ల రోడ్డుపక్కన, గోస్థనీ నది ఒడ్డున, కాలువ గట్టున, చెరువుగట్టున దళితులు ఖననం చేస్తున్నారని వాపోయారు. ఈ స్మశాన వాటిక సమస్యలపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్న ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం యంత్రాంగం కనీసం పట్టించుకోలేదని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన దళితపేటలో స్మశాన వాటికల అభివద్ధిపై చర్చ జరగడం అభినందనీయమన్నారు. తక్షణం 296 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేసి ఎన్ని దళిత పేటలకు శ్మశాన వాటికలు లేవో తేల్చాలని ఆయన కోరారు. జిల్లాలో దళిత శ్మశాన వాటిక సమస్యలపై పోరాడుతున్న కెవిపిఎస్‌తోపాటు ఇతర దళిత సంఘాలతో తక్షణం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



పాలకోడేరు: విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్, ఎంపిపి చంటిరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతన సాంకేతికతను అందుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పేరుపాలెం, శేరేపాలెం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు అందజేశారు. ఇన్‌ఛార్జి పుష్పరాజ్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, నాయకులు అందే భుజంగరావు, ఆంద్రజు చల్లారావు, ఓసూర్ విజ్జిబాబు పాల్గొన్నారు.

కాళ్ల: విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే మంచి విద్యతోపాటు సాంకేతికత పరిజ్ఞానం కూడా అవసరమని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. శుక్రవారం బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె.రవీంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె. నిర్మలాదేవి, జివి.నాగేశ్వరరావు, బండారు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

పాలకోడేరు : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం టెక్నాలజీతో అధునాతన విద్యనందించడం అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను మండలంలో గరగపర్రు, గొల్లలకోడేరు, కొమ్మదవల్లి, పాలకోడేరు, వెరాగల్లు, శృంగవృక్షం, పెన్నాడ, విస్సాకోడేరు గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), ఉప ఎంపిపి ఆదాడ లక్ష్మీ తులసి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరవాసరం: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారంటే నాడు వైఎస్ఆర్, నేడు జగన్‌మోహన్‌రెడ్డి వల్లేనని డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందజేస్తున్న ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద నిర్వహించారు. వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు అధ్యక్షతన జరిగిన కార్యక్రమనికి ముఖ్య అతిథిగా వేండ్ర వెంకటస్వామి హాజరై మాట్లాడారు. సిఎం జగన్ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. ఉన్నత వర్గాలకు చెందిన విద్యార్థులకు అందుబాటులో ఉండే ట్యాబ్‌లను నేడు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ముందు ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయడం మంచిదేనని, అయితే డిజిటల్ ట్యాబ్‌ల వల్ల విద్యార్థుల ధోరణి పక్కదోవకు పట్టే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను గమనిసూదుండాలన్నారు. మండలంలో ఏడు హైస్కూళ్లకు, ఒక యుపి స్కూల్‌కు, ఉపాధ్యాయులకు కలిపి మొత్తం 629 ట్యాబ్‌లను అందజేయడం జరిగిందని ఎంఇఒ బి.వినాయకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు బోను జోత్స్యదేవి, వీరవల్లి ఉషారాణి, ఎఎంసి వైస్ ఛైర్మన్ పాలా లక్ష్మీకుమారి, సర్పంచులు ఓంకారం పాల్గొన్నారు.

కార్యక్రమంపై విమర్శలు..

ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించిన తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం పరంగా చేయాల్సిన కార్యక్రమాన్ని వైసిపి కార్యక్రమంలా చేయడం పట్ల ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. ఈ కార్యక్రమం విద్యాశాఖ అధ్యక్షతన నిర్వహించకపోవడం పట్ల అధికారుల తీరును తప్పుపడుతున్నారు.

వనరులు అందరికీ అందితేనే సుపరిపాలన

జిల్లా జాయింట్ కలెక్టర్ మురళీ

ప్రజాశక్తి - భీమవరం

దేశ వనరులు గ్రామాల్లో చివరి వ్యక్తి వరకూ అందినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో సుపరిపాలనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెరుగైన పౌర సేవలు, శాఖాపరమైన విధుల నిర్వహణా సామర్థ్యం మెరుగుపర్చుకుని అందులో సాధించిన విజయాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాల ద్వారా సుపరిపాలనను అందించాలన్నారు. తద్వారా ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పౌర సేవలను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు, స్పందన ప్రజా సమస్యల సత్వర పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహిం చాలన్నారు. సమావేశంలో డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

కొనుగోళ్లలో రాష్ట్రంలోనే జిల్లాకు మొదటి స్థానం


వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జెసి మురళీ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతోందని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో 80 శాతం కొనుగోళ్లు పూర్తి చేశారని జిల్లా జాయింట్ కలెక్టరు జెవి.మురళీ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జిల్లా అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో పౌరసరఫరాలు, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమర్థవంతంగా పని చేసి ధాన్యం కొనుగోలులో రాష్ట్రంలో మొదటి స్థానం తీసుకొచ్చారన్నారు. ధాన్యం కొనుగోలు నూతన ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పర్యవేక్షించారన్నారు. ఇ-క్రాప్ బుకింగ్‌నకు వ్యవసాయ శాఖాధికారులు సిద్ధం కావాలని సూచించారు. ఆక్వా రైతులు జిల్లాలో 15 వేల మంది ఉన్నారని, దీనిలో 13,841 మందికి అన్ని తనిఖీలు పూర్తి చేసి వారికి విద్యుత్ సబ్సిడీ మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామని తెలిపారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో రూ.528.76 కోట్లు విలువైన ధాన్యం 2.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం 44,330 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామంలో 250 ఎకరాలు ఒక యూనిట్‌గా తీసుకుని క్లస్టర్ పొలంబడి నిర్వహిస్తున్నామని, దీనిలో వ్యవసాయానికి సంబంధించి అన్ని మెళకువలు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని అన్నారు. సమావేశంలో సభ్యులు కొట్టి కుటుంబరావు, ఉద్దరాజు విజయరామరాజు, ప్రసాదరాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, నాబార్డు డిడిఎం టి.అనిల్‌కాంత్, జిల్లా వాటర్ రిసోర్స్ అధికారి పి.నాగార్జునరావు, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఎన్.సరోజ, పౌరసరఫరాల శాఖ మేనేజర్ టి.శివరామప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎ.దుర్గేశ్, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



మొగల్తూరు: ప్రజలతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజా సమస్యల పరిష్కారమే గడపగడపకూ మన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం పేరుపాలెంలో కనకదుర్గమ్మ గుడి నుంచి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తిరుమల బాపూజీ, నాయకులు అందే భుజంగరావు, కటికలు సూర్యారావు, కర్రి ఏసుబాబు పాల్గొన్నారు.

ఉండి : అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం ఉండి గ్రామ రెండో సచివాలయం పరిధిలోని సీతారాంపేట, భవానీపేట, రామాపురం, పులిగుమ్మ తదితర ప్రాంతాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జానపద సృజనాత్మకత కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, ఎంపిపి పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండ పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చేసే పనులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లు నిలిపేందుకు స్థలం కేటాయింపు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజల అవసరార్థం అంబులెన్సులు అందుబాటులో ఉండేందుకు పట్టణంలోని ఎన్‌వి రంగారావు విగ్రహం వద్ద వాటికి స్థలం కేటాయించినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని అంబులెన్స్ యజమానులు వారి నుంచి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికంగా ఛార్జీలు వసూలు చేస్తే స్పందన నంబర్ 1900కు గానీ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నంబర్ 9154293446కు గాని ఫిర్యాదు చేయాలని తెలిపారు.

చదరంగం పోటీల్లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లాలోని అత్తిలిలో జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాలకొల్లు ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థి మద్దుల మానస్ శ్రీవత్సవ్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. అండర్-19 కేటగిరిలో బాలుర విభాగంలో రాష్ట్రస్థాయిలో 4వ స్థానాన్ని సాధించి జాతీయ స్థాయి ఎంపికయ్యాడని ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్.వి.రాఘవరెడ్డి, ఎఓ జి.వాసుబాబు తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

గొడౌన్ల సామర్థ్యాన్ని పెంచాలని ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలోని కేంద్ర గిడ్డంగుల సంస్థకు చెందిన గొడౌన్లకు మరమ్మతులు చేపట్టి వాటి సామర్థ్యాన్ని పెంచాలని ఎఐటియుసి ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ గొడౌన్లను పరిరక్షించాలని, స్థానిక సిడబ్ల్యుసి గొడౌన్ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో సిడబ్ల్యుసి గొడౌన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం కేంద్ర గిడ్డంగుల సంస్థకు చెందిన గోదాముల్లో 70 వేల టన్నుల నిల్వసామర్థ్యం ఉందని, అయితే అందులో 20 వేల టన్నుల సామర్థ్యం గల గోదాములకు మరమ్మతులు చేయాల్సి ఉందని, చాలా కాలంగా మరమ్మతులు చేపట్టకపోవడంతో అవి వినియోగంలో లేవని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు, ఎఐటియుసి ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు మాట్లాడారు. అనంతరం యూనియన్ నాయకులు గొడౌన్ మేనేజర్ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు బడబల్ల లక్ష్మీనారాయణ, ఎఐటియుసి ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'ప్రభుత్వానిది అరాచక పాలన'

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సబ్సిడీలనూ రద్దు చేస్తూ అరాచక పాలన సాగిస్తోందని అగ్నికుల క్షత్రియ సాధికార సంఘం రాష్ట్ర కన్వీనర్ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ (రవి) విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అర్హులైన ప్రజలను మోసం చేస్తూ వారికి రావాల్సిన సబ్సిడీలను రద్దు చేస్తోందన్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 3,000 మంది పెన్షన్లు తీసేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఆయన అరాచకపాలనను ప్రజలు అంతమొందించాలన్నారు. పేర్లు మార్చి పథకాలు ఇస్తూ వాటికి అనేక రకాల ఆంక్షలు విధిస్తూ ప్రజలకు అందకుండా చేస్తున్నారని విమర్శించారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

నా ఓటు హక్కును పరిశీలించుకోవాల్సిన దౌర్భాగ్య స్థితి రాష్ట్రంలో నెలకొందని ఇదేం ఖర్మ రా నాయనా అని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. శుక్రవారం వెలగలవారిపాలెం, గరువు, మల్లిపూడి, ఆలమూరు గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం అనంతరం గ్రామాలవారీగా బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలగలవారిపాలెంలో పితాని సత్యనారాయణ మాట్లాడారు. కరోనా ఫోర్త్ వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రధాని సూచనలు చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం కార్యకర్తల నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెలగల సునీల, గ్రామ అధ్యక్షుడు కర్రి బుల్లిరాజురెడ్డి, మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి (బుల్లబ్బ), మాజీ ఎంపిపి కరణాని విజయకుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరు : వైసిపి ప్రభుత్వ పాలనలో సామాన్యుడు బతకడం కష్టంగా మారిందని టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు విమర్శించారు. శుక్రవారం సాయంత్రం మొగల్తూరు పంచాయతీలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్నది టిడిపి ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, కొల్లాటి భోగరాజు, పాల రాంబాబు, గోపాలం పాల్గొన్నారు.

ఉండి : ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు సూచనల మేరకు టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో మండలంలోని వాండ్రం, పెదపుల్లేరు, చినపుల్లేరు గ్రామాల్లో ఇదేమి కర్మరా మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, సంక్షేమ పథకాలు అందజేసి ధరలను విపరీతంగా పెంచేస్తున్నారని నాగరాజు విమర్శించారు. ఈ కార్యక్రమంలో వాండ్రం గ్రామ అధ్యక్షులు కందుల రాధా బలరామకృష్ణ శ్రీనివాస్, పెదపుల్లేరు గ్రామ అధ్యక్షులు నడింపల్లి సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: దగ్గులూరు గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలో వాసులు పడుతున్న ఇబ్బందులను నోట్ చేసుకుని, టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వం ఏదో కారణం చూపించి లబ్ధిదారులను తొలగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆచంట

దొంగతనాలను అరికట్టేందుకు శివారు ప్రాంతాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆచంట ఎస్ఐ బివిఎస్‌కె.ప్రసాద్ అన్నారు. శుక్రవారం పెదమల్లం గ్రామంలో సర్పంచి దిరిశాల విజయలక్ష్మి, గ్రామస్తులు, దాతల సహకారంతో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల దొంగలను త్వరితగతిన పట్టుకోవచ్చన్నారు. మండలంలో చిన్న చిన్న దొంగతనాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు తన వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. మండలంలో జూదం కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



పెదమల్లంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసిన ఎస్ఐ ప్రసాద్

రైతే దేశానికి వెన్నెముక

ఘనంగా రైతు దినోత్సవం

ప్రజాశక్తి - ఆచంట

రైతే దేశానికి వెన్నెముక అని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. శుక్రవారం కోడమంచిలి రైతు భరోసా కేంద్రం వద్ద జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం అనే పదంలోనే సాయం ఉందన్నారు. రైతు సంక్షేమం కోసం రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి, అనేక పథకాలను ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు చింతా సుబ్బారావు, కుసుమే ధర్మంగారావు, కొండేటి వరప్రసాద్, కొండేటి దినేష్ పాల్గొన్నారు.

కాళ్ల : ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జుత్తుగ నాగరాజు అన్నారు. కోమటిపుంత గ్రామంలో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తుగ నాగరాజు మాట్లాడుతూ రైతు పక్షపాతి అని చెప్పే రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోకుండా వారికి అన్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, కొటికలపూడి తాతాజీ, నానాజీ, గవర లక్ష్మి, దిలీప్ పాల్గొన్నారు.

వీరవాసరం : రైతు దినోత్సవాన్ని జనసేన కార్యాలయం వద్ద నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు గుండా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలోని ప్రతి గ్రామం నుంచీ ఒక ఉత్తమ రైతును గుర్తించి ఇరవై ఐదు మంది రైతులను సత్కరించారు. ఈ సందర్భంగా జనసేన రైతు సంఘం నాయకుడు పుప్పాల సుబ్బారావు మాట్లాడుతూ ధాన్యం అమ్మకాల్లో జరుగుతున్న అవకతవకలను వెంటనే అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్, వైస్ ఎంపిపిలు అడ్డాల రాము, సర్పంచి వేంద్ర లీలాకృష్ణ, ఎంపిటిసి యాళ్లబండి ఇందిర పాల్గొన్నారు.

పాలకొల్లు : సంక్షోభంలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని యునైటెడ్ కాపు ఇంటర్ నేషనల్ క్లబ్ గవర్నర్ ముచ్చర్ల సంజయ్ కోరారు. రైతు దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణ శివారు బొంతు నారాయణరావు, నుదునూరి శ్రీనివాస్ రైతులను క్లబ్ తరపున సత్కరించారు. ఈ సందర్భంగా సంజయ్, క్లబ్ అధ్యక్షులు పెనుమాక రామ్మోహన్ మాట్లాడారు. రైతులు ధాన్యం, రొయ్యలు అమ్మడానికి ఇక్కట్లు పడుతున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి కానూరి ప్రభాకర్, వ్యవస్థాపకుడు పోకల రాము, అనిశెట్టి సుబ్బరాజు, గంధం ఏసుబాబు, రవి, గుణ్ణం రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రైతన్నలకు వైసిపి ప్రభుత్వం తిరని ద్రోహం చేస్తోందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా జనసేన కార్యాలయంలో రైతులను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు సరైన ఆదరణ లేదన్నారు. వైసిపి రైతులను అనేక విధాలుగా కన్నీరు పెట్టించిన దుర్మార్గపు ప్రభుత్వమన్నారు. రైతన్నలకు జరుగుతున్న అన్యాయంపై జనసేన ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు.

తణుకు : రైతులకు సకాలంలో లారీలు సరఫరా చేయాలని, లారీలు సకాలంలో అందించకపోవడంతో రైతులు ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలకు తరలించలేకపోతున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు కోరారు. రైతు దినోత్సవాన్ని నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని రైతుల దగ్గర నుంచి శాతంతో పనిలేకుండా నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు వీర మహిళలు, రైతులు పాల్గొన్నారు.

పోడూరు : గుమ్మలూరు మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ అధ్యక్షతన రైతు దినోత్సవం జరిగింది. ముందుగా చౌదరి చరణ్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు పంటను పండించే దశలను సూర్య కుమార్ పేపరు క్లిప్పింగ్‌లతో రూపొందించిన చార్టులను విద్యార్థులచే ప్రదర్శింపజేశారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా సహాయ కార్యదర్శి రావి హరీష్ బాబు విద్యార్థులకు రైతు దినోత్సవంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.



వీరవాసరంలో రైతుల్నుు సత్కరించిన జనసేన నేతలు

విద్యార్థికి మానవత సాయం

ప్రజాశక్తి - తణుకు

తణుకు మానవత ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేసినట్లు సంస్థ అధ్యక్షులు ఆలపాటి సుబ్బారావు తెలిపారు. శుక్రవారం స్థానిక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నరసాపురం స్వర్ణాంధ్ర కళాశాలలో ఎంసిఎ చదువుతున్న పట్టణానికి చెందిన లంక గణేష్ సాయికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. మానవత సెంట్రల్ కమిటీ ఛైర్మన్ నిమ్మనపల్లి రామచంద్రారెడ్డి రూ.పది వేలు, కటారి శారదా దేవి ఐదువేల రూపాయలు, కర్రి శ్రీనివాస్‌రెడ్డి 3000 రూపాయలు, పడాల వెంకటరెడ్డి రూ.2,000 అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ కోడూరి రాధా పుష్పవతి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుండి గణేష్ మానవత సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సంస్థ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నాడని తెలిపారు. అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కారణంగా అతని చదువు నిమిత్తం ఆర్థిక సహాయం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ కమిటీ ఛైర్మన్ గమిని రాంబాబు, సంస్థ సెక్రటరీ సత్యనారాయణ, పూర్వ అధ్యక్షులు హనుమంతరావు, కన్వీనర్ ఎస్‌వి సతీష్‌బాబు పాల్గొన్నారు.



గణేష్ సాయికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

పెదవీరప్పకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల అస్వస్థతకు గురైన ఉండి వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్, పాములపర్రు మాజీ సర్పంచి తాటిపర్తి పెదవీరప్పను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు శుక్రవారం పరామర్శించారు. పాములపర్రులో పెదవీరప్పను పరామర్శించిన అనంతరం వారు మాట్లాడారు. తలలో ఇన్ఫెక్షన్ చేరి వారం క్రితం విజయవాడ మణిపాల్ హాస్పిటల్లో పెదవీరప్ప శస్త్ర చికిత్స చేయించుకున్నారన్నారు. పెదవీరప్పను పరామర్శించిన వారిలో రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, పాములపర్రు గ్రామ సర్పంచి కేశన శాంతికుమారి ఉన్నారు.



విద్యారంగంలో వినూత్న విప్లవం

వైసిపి అధికార ప్రతినిధి బడుగు బాలాజీ

ప్రజాశక్తి - ఉండి

ముఖ్యమంత్రి నూతన ఆలోచనలతో విద్యారంగంలో వినూత్న విప్లవం తీసుకొచ్చారని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ అన్నారు. శుక్రవారం ఉండిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలకాయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడం చరిత్రలోనే సువర్ణ అధ్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.1,466 కోట్లు ఖర్చు పెడుతోందని తెలిపారు. పేద విద్యార్థులకు ఇది గొప్ప వరమని తెలియజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ తెలిపారు. అరటకట్ల గ్రామంలో 109వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. దానిలో భాగంగా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి మళ్లీ సిఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అనంతరం స్కూల్లో 35 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అలాగే జగనన్న హౌసింగ్ కాలనీలో 19 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రుద్రరాజు శ్రీనివాసరాజు, ఎంపిటిసి చింతపల్లి సాయిబాబా, సొసైటీ అధ్యక్షులు ముదునూరి సూర్యనారాయణ రాజు, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజులు నాయుడు, ఇల్లా వెంకటేశ్వరరావు, బొక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నటుడు సత్యనారాయణ మృతికి సంతాపం

ప్రజాశక్తి - పాలకొల్లు

సినీ నటుడు కైకాల సత్యనారాయణ మరణం పట్ల పాలకొల్లు నటీనట సమాఖ్య సభ్యులు శుక్రవారం ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పాలకొల్లులో 2005లో సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన పౌర సన్మానం జరిగింది. దర్శకరత్న దాసరి నారాయణరావు ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సమాఖ్య గౌరవాధ్యక్షులు వంగా నరసింహారావు, అధ్యక్షులు కత్తుల రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి తాళా బత్తుల వెంకటేశ్వర రావు తదితరులు సంతాపం తెలిపారు.

బాబా ఆలయానికి సిమెంట్ బస్తాలు అందజేత

పాలకొల్లు రూరల్: పాలకొల్లు శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు సబ్బేవారి పేట హనుమాన్‌నగర్‌లో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి శుక్రవారం 25 సిమెంట్ బస్తాలను ధర్మారావు ఫౌండేషన్ ద్వారా అందజేశారు. దీంతో ఆలయ నిర్మాణ కర్తలు సాయిబాబా ఆశీస్సులు ఎల్లప్పుడూ నిమ్మల రామానాయుడుపై ఉండాలని కోరుతున్నామని చెప్పారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం : సర్పంచి

ప్రజాశక్తి - ఉండి

గ్రామాభివృద్ధే ధ్యేయంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం పనిచేస్తోందని గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఉండి గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో వారు మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి గాను గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలను వార్డు సభ్యుల ద్వారా తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో శుద్ధి జలాన్ని ప్రతి ఒక్కరికీ అందించాలనే ఉద్దేశంతో సీతారాంపేట ప్రాంతంలో సుమారు 40 లక్షల రూపాయలతో ఓవర్ హెడ్ ట్యాంక్ ను నిర్మించే ఆలోచనలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, సచివాలయ అధికారులు, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎరువుల గొడౌన్లలో తనిఖీలు

ప్రజాశక్తి - అత్తిలి

రైతులకు ఎరువులు అమ్మిన వెంటనే ఇ పోస్‌లో నమోదు చేయాలని ఎఒ టికె.రాజేష్ అన్నారు. శుక్రవారం తిరుపతిపురం, వరిఘేడు గ్రామాల్లో ఎరువుల గొడౌన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గొడౌన్లలో ఎరువుల శాంపిల్స్ సేకరించి పరీక్ష నిమిత్తం కోడింగ్ సెంటర్‌కు పంపించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రైతులకు బిల్లులు ఇవ్వాలని, అమ్మిన సరుకుకు సంబంధించి వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. రైతులు ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు సరిపడా ఎరువులు ఇవ్వాలన్నారు. రైతులు నిర్దేశించిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని, దాళ్వాకు ఎక్కువ ఎరువుల వినియోగం ఉంటుందని, నాట్లు వేసిన 15 రోజుల్లోపు మాత్రమే భాస్వరం ఇచ్చే ఎరువులు వేయాలని తెలిపారు. నాటిన పది రోజుల తర్వాత మంచి సూటి ఎరువులు యూరియా, పొటాష్ వాడితే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వరిఘేడు సొసైటీ సెక్రటరీ ఇ.శ్రీనివాస్, ఎఇఒ అరుణ, విఎఎ హారిక పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌పై మరో కేసు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ గత నెలలో సస్పెన్షన్‌కు గురైన జీవన్ బాబుపై శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎంజవీరబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముత్యాలపల్లి, శేరేపాలెం, పేరుపాలెం, కెపిపాలెం గ్రామాలకు చెందిన నిషేధ జాబితాలోని భూముల సంబంధించి సుమారు 50 రిజిస్ట్రేషన్లు చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. గతంలో 48 రిజిస్ట్రేషన్లకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయని ఎస్ఐ తెలిపారు. కేసును సిఐ వాడవల్లి సురేష్ బాబు విచారణ చేస్తారని తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఎం.వీరబాబు సూచించారు. మండలంలో శుక్రవారం ప్రధాన కోడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని వానచోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ లేని వారు తప్పనిసరిగా హెల్మెట్ కొనుగోలు చేసి ధరించాలని అన్నారు.

కార్యదర్శి పట్ల వార్డు సభ్యుని అనుచిత ప్రవర్తన

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని ఒక గ్రామంలో కార్యదర్శి పట్ల అభ్యంతకరంగా ప్రవర్తించిన వార్డు సభ్యునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రేడ్-5 కార్యదర్శి పట్ల ఈ నెల 13న పంచాయతీ వార్డు సభ్యుడు అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం బాధితురాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్ ఆదేశాలు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసి రాజు

వస్తువుల నాణ్యతపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆదిత్య డిగ్రీ కాలేజ్ సహకారంతో కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ వారి ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కులు, వస్తువుల నాణ్యతపై కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఛైర్మన్ పి.రవి కిరణ్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌డిఒ దాసి రాజు పాల్గొని మాట్లాడారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులన్నారు. వినియోగదారుల హక్కులు, వస్తువుల నాణ్యతపై అవగాహన సదస్సు నిర్వహించడం మంచి విషయమన్నారు. కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఛైర్మన్ రవికిరణ్ మాట్లాడుతూ వినియోగదారుల నాణ్యతలేని వస్తువులు కొని మోసపోయి మౌనంగా ఉంటున్నారని తెలిపారు. మాంసం, చేపలు కొనుగోలు చేసే షాపుల పరిసరాలు శుభ్రంగా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామరాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తణుకుల.రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక హెడ్ పోస్టాఫీసులో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పట్టణ సిఐ నాగరాజు, ఎస్ఐ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు బోధనలను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్టాఫీస్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ జి.అరుణ, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ ఎస్‌కె.చిన్ని, నిడదవోలు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ముత్యాలరాజు పాల్గొన్నారు.

కాళ్ల : ఏలూరుపాడులో మండల ఎఫ్‌ఎఫ్‌సిఐ సేవకుల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫ్రీడమ్ ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రేటీ స్టేట్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ ఎమ్‌డి ఇస్మాయిల్ అధ్యక్షత వహించారు. ఈ వేడుకలకు ఎంఎల్ఎ మంతెన రామరాజు, ఎఫ్‌ఎఫ్ సిఐ నేషనల్ ప్రెసిడెంట్ పీటర్ పుట్టా, ప్రొడక్షన్ ప్రెసిడెంట్ స్టీఫెన్ బాబు, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ స్థాన్‌లే థామస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పాస్టర్లకు బ్యాగులు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జువ్వలపాలెం ఉపసర్పంచ్ కఠారి లక్ష్మీపతిరాజు, మండల కో ఆప్షన్ సభ్యుడు గుణ్ణం జార్జిబెనర్, ఎఫ్‌ఎఫ్ సిఐ స్టేట్ కోఆర్డినేటర్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లు: పట్టణంలోని 18వ వార్డు లూథరన్ చర్చి కాంపౌండ్‌లో కాపవరపు జక్కరయ్య ఆధ్వర్యంలో క్రిస్మస్ ఆరాధన కార్యక్రమం శుక్రవారం జరిగింది. డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి రామాంజుల పెద్దమదు, పాస్టర్స్ అబ్రహంలింకన్, గోడి సాల్మన్ పాల్గొన్నారు.

సన్ షైన్ స్కూల్లో క్రిస్మస్ సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఫెమినా క్లబ్ సభ్యురాలు ఎం.వరలక్ష్మి విచ్చేసి ఏసుప్రభు చరిత్రపై సందేశాన్ని అందించారు. విద్యార్థులు నృత్యాలు, పాటలతో, జీసస్ ప్రార్థనలతో, హ్యాపీ హ్యాపీ క్రిస్మస్ అంటూ పాఠశాల ఆవరణ అంతా పండుగ వాతావరణం సృష్టించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ ఎన్‌వివిఎస్ పాపారావు నాయుడు, ఫెమినా క్లబ్ చైతన్య పాల్గొన్నారు.

భీమవరం: కలెక్టరేట్లోని జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో సమాచార శాఖ సహాయ సంచాలకులు దాసరి నాగార్జున్ ఆధ్వర్యంలో సహ ఉద్యోగులతో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమాచార శాఖ సహాయ సంచాలకులు నాగర్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మంచి హృదయం కలిగి ఎదుటి వారికి సాయం చేసినప్పుడే దేవుని ఆశీస్సులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌ఒ టి.నాగేశ్వరరావు, ఎఇఇ ఎన్.వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ కెటిఎంకె సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్‌గా పెద్దిరాజు

ప్రజాశక్తి - ఆచంట

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పి) ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల కన్వీనర్‌గా ఆచంట వేమవరం గ్రామానికి చెందిన కనపాల పెద్దిరాజును నియమించి నియమాపక పత్రాన్ని అందించినట్లు ఆ పార్టీ ఇన్‌ఛార్జి బయ్యారపు రాజేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆయన గతంలో జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా పని చేశారని, దీనిలో భాగంగా నేడు జిల్లా కన్వీనర్‌గా నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు.

SUMMONS UNDER ORDER V RULE 20 CPC
IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT TANUKU
O.S.No.375 of 2022

Between:
Manthena Peddi Raju ...Plaintiff
And
Satti Srinivasa Reddy ...Defendant
To.
Defendant: Satti Srinivasa Reddy, S/o.Satyanarayana Reddy, Near Sai Baba Temple, Vemana Street, Kommara Village, Attili Mandal, Tanuku J.C.J.C.

Where as the PLAINTIFF has instituted asuit against you for recovery of amount. You are hereby summoned to appear in this Court in person or by a pleader duly instructed, and able to answer all material questions, relating to the suit, or who shall be accompanied by some person able to answer all such questions, on the **06th DAY OF JANUARY, 2023** at 10 O' Clock to answer the claim and as the day fixed for your appearance is appointed for the final disposal of the suit, you must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to rely in support of your defense. Take notice that, in default of your appearance on the day before mentioned, the suit be heard and determined in your absence.

Rayaprolu Raja Kiran,
R.A.Begum, Advocates,
Tanuku-534 211,
Cell:8341437279
Tanuku,
23/12/2022

ప్రకటన

IN THE COURT OF THE 1st ADDL JUNIOR CIVIL JUDGE - TANUKU
O.S.No.512/2022

Between:
వాది: కోమట్లపల్లి సుధాకర చౌదరి
మరియు
ప్రతివాది: సోడదాసి యాకోబు,
తండ్రి: స్యామ్యుయల్, డోర్.9-8-8,
బ్రిడ్జ్‌పేట, గునుపూడి విలేజ్, భీమవరం,
వెస్ట్ గోదావరి జిల్లా - B.J.C.J.C.

పై నెంబరు దావాలో ప్రతివాది ఐనా సోడదాసి యాకోబు గార్కి, దావా సంగతులు తెలియచేస్తు దావా సమన్లు కోర్ట్ ద్వారనున్ను, రెజిస్టర్డ్ పోస్ట్‌లో నున్ను ఎన్నిసార్లు పంపినను తీసుకొనక Avoid చేయుస్తున్నందున్న మీరు దావాలో వాయిదా ది.05-01-2023 ఉదయం 10.30 లకుపై కోర్ట్ వారి యెదుట హాజరు అయి ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనియెడల మీ పరోక్షంగా తీర్మానం చేయుదురనియు ప్రకటన ద్వారా తెలుపడమైనది.

By order of Court
MOSALI VENKATESWARLU M.A.,L.L.B.,B.Ed.
Advocate, Tanuku, W.G.Dt.
Cell:80193 01232
తణుకు
22-12-2022